సితార న్యాయం

ఇమంది రామారావు

అప్పుడే ఎ.వి.యం. స్టూడియోలో షూటింగు పూర్తిచేసుకుని వచ్చింది సుజాత. కోకోనట్ ఆయిలు మొహానికి రుద్దుకుంది. టవల్‌తో మొహం తుడుచుకుంది. బాత్‌రూంకెళ్ళి రిఫ్రెష్ అయి వచ్చింది. అల్ట్రా మాడర్న్ మాక్సీ తొడుక్కుంది. అద్దంలో తన రూపం తననే వెక్కిరిస్తున్నట్టు కనిపించింది. ఏడవలేక నవ్వుకుంది.

టెలిఫోన్ మోగింది. ఫోన్ అందుకుంది.

"హలో స్పీకింగ్!" అంది.

"మాది విశాఖపట్నమండీ. మీ ఫేన్సునండి" అవతలి కంఠంలో కొండంత ఆనందం కొట్టొచ్చినపుడు తొమ్మిది గంటల ప్రాంతం గమనించకుండా కనిపించింది. విషయం చెప్పకుండా తడబడుతుంది అభిమాని గొంతు.

"ఏమిటి విషయం చెప్పండీ!" సుజాత చిరాకుపడింది.

"మీరు నటించిన సుగుణ రిలీజయ్యింది కదండీ. ఫస్టు షో అంటే.... ప్రొద్దుటాటండీ. టాక్ అదిరిపోయిందండీ.

మాట్నీ అదరటోండీ. యిదిగో యిప్పుడిప్పుడే నైట్ షో ఇంటర్వెల్ అయిందండీ. టాక్ కనుక్కున్నామండీ రెండొందల రోజులు గ్యారంటీ అండీ—హిహిహి" ప్లస్ ఆయాసం ధ్వనించింది అవతలి గొంతులో. సుజాత కూడా నవ్వింది.

"మేం మద్రాసులో కలవాలనుకుంటున్నామండీ—ఎప్పుడుంటారు? అంటే చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడాలండీ—ప ర్స న ల న్న మా ట—యెప్పుడు రమ్మంటారు?" ఆదుర్దాగా అడిగింది అభిమాని గొంతు.

"మీ యిష్టం! రెస్ట్‌లోగా మద్రాసులో వుంటాను. ఎపుడయినా కలవండి — నాకింకో ముఖ్యమైన పనుంది ఫోను పెట్టేస్తున్నానేం?" ఫోనులో రిక్వెస్టు చేస్తున్నట్టుగా అడిగింది. అవతలి గొంతు నవ్వింది తీయగా.

"క్లైమాక్సులో మీ యాక్షన్....అబ్బో... థియేటర్ అదిరిపోయిందనుకోండి."

"థాంక్స్!"

"ఈ సంవత్సరం మీకు నేషనల్ అవార్డు రావడం ఖాయం!"

"థాంక్స్!"

"ఈ పిక్చరు మీ జీవితంలో ఓ క్రోసురాయి అవుతుందని మా నమ్మకం!"

"థాంక్స్!"

"ఈ వారంలో మిమ్మల్ని కలుస్తామండీ—"

"థాంక్స్!"

"అదేవిటండీ — అన్నిటికీ థాంక్స్ చెప్పి తప్పించుకుంటున్నారు — ఎక్స్‌టెన్షన్ ప్లీజ్" అన్నాడు ఫోనులో అవతలి వ్యక్తి.

సుజాత యిక భరించలేక ఫోను పెట్టేసింది. అబ్బా! అభిమానం ఎంత భయంకరంగా వుంటుంది? ఒక్క క్షణం తన జీవితం గురించి ఆలోచించకుండా వుండలేక పోయింది. మళ్ళీ ఫోను మోగింది.

"హలో స్పీకింగ్!"

"సుజాతగారూ! మీ కేవిటి ఇష్టమండీ—చాలా యిష్టమైంది ఏవిటో చెప్పండి. వచ్చినపుడు తీసుకొస్తాను!" అన్నాడు విశాఖపట్నం అభిమాని.

"రవ్వల నెక్లెస్ యిష్టం!" అంటూ చిరాగ్గా ఫోను పెట్టేసింది.

మళ్ళీ ఫోను రింగవుతోంది—

"హలో...." అసహనంగా పలకరించింది.

"నేను బాబుని!" తీయగా అన్నాడు. బాబు పెద్ద సినిమా స్టార్. స్టార్ అని ఎందుకనవల్సి వచ్చిందంటే, అతనిలో టాలెంట్ కంటే, అదృష్టం పాళ్ళు ఎక్కువ—ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలో, ఎక్కువ సంపాదించగలిగాడు బాబు. కోటికి పడగ ఎత్తాడు. చాలా రిజర్వ్‌డ్ గా వుంటాడు.

బాబు మాటల్లో ఆప్యాయత, ఆత్మీయత కనిపిస్తాయి. అందుకే హీరోయిన్సంతా బాబుతో క్లోజ్ గా వుంటారు. సుజాత మరింత సన్నిహితంగా వుంటుంది. బాబు, సుజాత కలిసి నటించిన గులాబి పువ్వు చిత్రం సూపర్ హిట్ అయ్యింది. దానికి భూషణరావు డైరెక్టర్—అప్పట్నించి బాబుతో కలిసి పనిచేయడమంటే సెంటిమెంట్ గా అనిపించింది.

"నువ్వా—ఒక పిచ్చోడనుకున్నాను!" అంది గలగలా నవ్వి.

6

"అవునుమరి — పదిగంటలకి ఫోను చేశానుకదా. ఏమైనా అనుకుంటావు."

"ఛీ—నిన్ను కాదు. ఒక పిచ్చోడు విశాఖపట్నం నుండి ట్రంకాల్ చేశాడు. ఎంతసేపని గంట వదల్లేదు. ప్రాణాలు తోడేశాడు. సరే నేనే నీకు ఫోనుచేయాలను కుంటున్నాను" అంది తీయగా.

"ఏవిట్ట పాపం!"

"పాపం మరి—నీతో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలి. ఎప్పుడు రాను?"

"రేపు కలుద్దాం—నీ షూటింగ్ ఎక్కడ?"

"వి. జి. పి. లో."

"వెరీగుడ్—నాకూ వి.జి.పి.లోనే—లంచ్ అవర్ లో తేలిగ్గా మాట్లాడొచ్చు—"

"ఓ.కే!" తీయగా బాబుకావలసిన బహుమతిని ఫోన్ లోనే అందించింది.

బాబు సెలయేరులా నవ్వాడు ఫోన్ పెట్టేస్తూ.

2

"సుజీ! మా డాడీ నన్ను ప్రొడ్యూసరుగా విరమించుకోమంటున్నాడు" పొగవదుల్తూ తాపీగా అన్నాడు శ్రీకాంత్. షాక్ తింది సుజాత.

"ఏం?"

"వైజాగ్ లో ఏదో ప్రైవేట్ గా ఫేక్టరీ ప్లాన్ చేస్తున్నారు. దానికి మేనేజింగ్ పార్ట్ నర్ ని నేను—నేను మాత్రమే నిర్వహించాలని ఆయన పట్టుదల" అన్నాడు కాసింత గర్వంగా—

"అయితే?" భారంగా నిట్టూర్చింది సుజాత.

"మనం వెంటనే పెళ్ళి చేసుకోవాలి. ఆయనకి నిన్ను

మంగళసూత్రంతో చూపించాలి. ఇఫ్ నాట్ — ఆయన చస్తే అంగీకరించరు—ఐదిబై అసలు విషయం ఫ్రాంక్ గా మాట్లాడుకుంటాం—నువ్వు నాతో వైజాగ్ వచ్చేయాలి. యికముందు సినిమాల్లో నటించకూడదు. యింతకుముందు నువు జీవితంలో ఎలా తిరిగావో—ఏం చేశావో అన్నది నా కనవసరం. పెళ్ళయ్యాక నాకు తెలియకుండా ఏ పనీ జరక్కూడదు.

పోతే, ఆ స్తిపా స్తులున్న అమ్మాయిలు నేను య్యాస్ అంటే లక్షమంది వస్తారు. టు బి ఫ్రాంక్—నాకు డబ్బు మీద ఆశలేదు. అలాగని నువు నా యింట్లో కాపురం చేస్తున్నపుడు, మా డాడీ గాని, అమ్మగాని, అక్కడెవరయినాగానీ సూటిపోటి మాటలతో విసిగించడం నేనంతకంటే సహించను. సో, నీతో ఎంతో కొంత ప్రాపర్టీ తీసుకురావడం శ్రేయస్కరం. ఫ్యాక్టరీలో నీకు షేర్ వుంటే, నువ్వు నా కుటుంబంలో సగర్వంగా తలెత్తుకొని తిరగగలవు.

ఈ మాటలు ప్రస్తుతానికి కష్టంగా, నిష్టూరంగా వుండొచ్చు — శాశ్వతమయిన నిర్ణయాలు తీసుకునే ముందు కొన్ని హెచ్చరికల్ని దృష్టిలో వుంచుకోవాలి. చెప్పు! బాగా ఆలోచించు నీ మనసులో ఏం వుందో స్పష్టంగా చెప్పెయ్—మనం ప్రేమించుకున్నాం. ఎలా? నేనో ప్రొడ్యూసరుగా, నువ్వొక హీరోయిన్ గా. వేషం కోసం ప్రతి హీరోయిను ప్రొడ్యూసర్ని లొంగదీసుకోవడమనేది సహజం! ప్రస్తుతం నీ గురించి, నా గురించి కూడా అంతకంటే ఎక్కువేం ప్రచారంలో లేదు—"

టెలిఫోను మ్రోగింది. సుజాతని ఫోను తీసుకోమని

శ్రీకాంత్ సైగచేశాడు. సుజాత ఫోనెత్తుకొని హలో అంది.

“ఈజిట్ సెవన్ జీరో టు?” అడిగింది గంభీరంగా ఓ గొంతు.

“యస్ ప్లీజ్!” అంది తీయగా. అవతలి గొంతు వెంటనే ప్రశ్నించలేకపోయింది.

“ఈజిట్ ఫిలిం ప్రొడ్యూసర్ మిష్టర్ శ్రీకాంత్ రూమ్!” అన్నాడు అటునుంచి — ఏం చెప్పమంటారు అన్నట్లు సైగచేసింది. రాంగ్ నంబర్ అని రాసి చూపించాడు శ్రీకాంత్. అలాగే చెప్పింది. సుజాత గుండె దడదడ కొట్టుకుంటుంది.

“ఎవరిదా కీచు కంఠం?”

“మా డాడీ. విన్నావుగా-గొంతు ఎంత గంభీరంగా వుందో మనిషి అంతకంటే గంభీరంగా వుంటాడు. బట్ వెరీ సిన్సియర్—” అన్నాడు. సుజాత కళ్ళు ఇంత చేసుకొని “అబ్బా!” అంది నవ్వుతూ.

“ఊఁ సరే — విషయానికొద్దాం! నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తే అన్ని విషయాల్లో రేపు రాత్రికి ఇదే టైమ్‌కి ఇక్కడ కలువ్ — నేనిప్పుడే మా డాడీని కలుసుకోవాలి. లేటయితే అనుమానం పిశాచం ఆయన— భరించలేం వట్టి నస—” అన్నాడు లేస్తూ.

3

“అది కాదు సుజాతా! నేను ఎంత రహస్యంగా వుంచాలని ప్రయత్నించినా, పత్రికవాళ్ళు ప్రాణం తీస్తున్నారు. రేపో మాపో మెయిన్ హెడ్డింగ్స్‌తో వెలువడుతుంది మన వార్త. ఇప్పుడిప్పుడే మంచి పేరు తెచ్చుకుంటున్న మనం కెరీర్‌లో యిలాంటి అపశృతుల్ని

కొని తెచ్చుకోవడం నీకూ నాకూ మంచిదికాదు. మన గుట్టు బట్టబయిలయిందనీ, ఫోటోలతోసహా సీరియల్ గా వేస్తామని బెదిరిస్తు రాస్తున్నారు కొందరు సంపాదకులు. ఎంతమందిని డబ్బుతో కొనగలం? మనం పెళ్ళిచేసుకుందాం! ప్రెస్ మన రహస్య సంబంధాన్ని మార్కెట్ లోకీడ్చి కాష్ చేసుకోకముందే మన పెళ్ళి వార్త చెప్పి, సెన్సేషను సృష్టించుకుందాం. ఏమంటావ్?" సుజాత మొహంలోకి పరీక్షగా చూస్తూ అడిగాడు భూషణరావు.

సుజాత ఆలోచనలో పడింది—

“రేపుదయం ఊటీ వెడుతున్నాను. అశోకాలో వుంటాను. రూమ్ నెంబర్ తో ఫోనుచేస్తాను. వివరాలు మాట్లాడు. తిరిగి రాగానే మన మేరేజ్—నీకు యిష్టం లేకపోతే, ఈలోగా తేల్చుకో—” అన్నాడు సిన్సియర్ గా.

సుజాత నిట్టూర్చింది. నేల చూపులు రాస్తూ కూర్చుంది—భూషణరావు దగ్గరికి జరిగాడు. సుజాత నవ్వింది. ఆ నవ్వు కోసమే భూషణరావు బ్రతుకుతున్నాడు. ఆ నవ్వు కోసమే భూషణరావు ఆమెను హీరోయిన్ గా బుక్ చేసి కంటిన్యూగా సినిమాలు తీసి సక్సెస్ అవుతున్నాడు. ఆ నవ్వు భూషణరావుకి సంజీవి. ఆ నవ్వు లేకపోతే భూషణరావు లేడు.

“సుజాతా! యింకో విషయం! నువు నన్ను పెళ్ళి చేసుకున్నంత మాత్రంలో, సినిమాల్లో నటించడం మానెయ్యనవసరంలేదు. నీ యిష్టం! నీ అలవాట్లు, నీ అభిరుచులూ నీవి! అలాగే నా విషయంలో కూడా. యిద్దరం సంపూర్ణమైన స్వేచ్ఛను అనుభవిద్దాం! డబ్బు

నీది నీ ఎకౌంట్‌లో వుంచు! మన పెళ్ళి నీకు యిష్టమో, కాదో సెన్ట్‌లోగా తెలియపరుచు! ఓ.కె. నాకు స్టోరీ సిటింగ్ వుంది."

"ఎందుకంత తొందర?" అంది సుజాత.

"అవును సుజాతా! తొందరపడవలసిన విషయాల్లో తొందరపడాలి. తప్పదు. జీవితంలో అలక్ష్యం చేసిన ఏక్షణం తిరిగిరాదు. ఓ.కె!"

4

"వెళ్ళా!" పగలబడి నవ్వాడు బాబు. నవ్వుతుంటే కుడి బుగ్గమీద అందంగా సొట్టపడుతుంది. చూడ్డానికి ఎంతో ముచ్చటగా వుంటుంది.

"అది కాదు బాబూ. వేళాకోళం కాదు. జరిగిన కథ నీకు చెప్పేను. యిక నిర్ణయం ఎలా తీసుకోవాలో నువు చెప్పు! నువు నాకు ఫ్రెండ్‌వి అన్నినూ—నీ మాటమీద, నీ ఆలోచనమీద నాకు విశ్వాసం వుంది. నువ్వేం చెబితే అది చేయాలని తీర్మానించుకున్నాను" అంది కాస్త బాధగా.

"ఏం! ఈ విషయంమీ నాన్నగారితో ప్రస్తావించలేకపోయారా?" అన్నాడు సీరియస్‌గా.

"సిగ్గు—నాన్నతో ఏమని మాట్లాడను. నువు చెప్పు?" అంది.

బాబు కాస్సేపు సీరియస్‌గా ఆలోచనలో మునిగిపోయాడు. సుజాత ఆ మా య కు రా లు. గలగలా మాట్లాడడం, ఏడుపొస్తే భోరున ఏడ్వేయడం తప్ప మిగతా విషయాలు దీర్ఘంగా ఆలోచించలేదు. అందుకే సుజాతకి ఏవయినా దీర్ఘ సందేహాలొస్తే తీరుస్తుంటాడు బాబు.

"సుజాతా! నువ్వు మరోలా అనుకోకు. ఈ పెళ్ళి ప్రసక్తి మానుకో. అంత ఆరోగ్యదాయకం కాదు. నీకే కాదు — వారికూడా. కొన్ని సందర్భాల్లో యిలాంటి ఒత్తిడి తప్పదు. నా జీవితంలో యిలాంటి అనుభవాలున్నై. తొందరపడలేదు. అవ్వే సర్దుకున్నాయి — కాలం కొన్ని సమస్యలకి పరిష్కారాన్ని చూపిస్తుంది. విధి నిర్ణయానికి జీవితాన్ని వదిలెయ్యడం.... అందినంతలో ఆనందాన్ని పొందటానికి ప్రయత్నం చేయడం ఫిలిం ఆర్టిస్టు లక్షణం! లేడీ ఆర్టిస్టుల్లో పెళ్ళిచేసుకొని, ఎవరూ బాగుపడలేదు. బాగుపడరు కూడా — ఆలోచించుకో!

పోనీ పెళ్ళి తాత్కాలికంగా మరో రెండు సంవత్సరాలు వాయిదా వెయ్యి. నిన్ను సిన్సియర్ గా ప్రేమించే వాళ్ళు రెండు సంవత్సరాలు వెయిట్ చేయడం.... అదేమంత పెద్ద సమస్యేం కాదు. అలా సెన్సిటివ్ గా ఫీలయ్యి. సిన్సియర్ గా వెయిట్ చేస్తే యు మేరీ హిమ్!" అన్నాడు అభయహస్తం చూపిస్తూ."

సుజాతకిది నచ్చింది. అందుకే బాలు సలహా సంప్రదింపులు కావాలని కోరుకుంటుంది. బాబు చెప్పిందే తు.చ తప్పకుండా సాధించాలని స్థిర నిశ్చయానికి వచ్చింది.

5

అప్పుడే షూటింగ్ పేకప్ అయ్యింది.

రేపు షూటింగుకి వేసుకోవలసిన డ్రస్సు, రేపు షూటింగులో వ్రాయనున్న సీన్సు తాలూకు వివరాలు ఎక్స్ప్లెన్ చేస్తున్నాడు అసోషియేట్ డైరెక్టరు రాము. రాము మాట్లాడుతుంటే ఎంతో వినయ సంపద ఉట్టిపడుతుంది అతని మాటల్లో.

ప్రొడక్షను ఎగ్జిక్యూటివ్ వచ్చి "ఏమ్మా! ఏం తీసుకుంటారు. గోల్డుకోయిన్ యివ్వమంటారా?" అన్నాడు గౌరవపూర్వకంగా. హీరోయిన్ని సాధ్యమయినంత ఎక్కువ కేంజ్ లో నే కాకాపట్టాలని ప్రయత్నం చేస్తుంటారు ప్రొడక్షనువాళ్ళు. యివ్వమన్నట్టు తలూపింది.

క్షణంలో యాపిల్ జ్యూస్ సుజాతముందు ప్రత్యక్షమైంది.

"గుడ్ ఈవినింగ్ మాడమ్!" అంటూ జారుకున్నాడు రాము.

జ్యూస్ సిప్ చేయడం పూర్తయింది.

కారు కదిలింది.

ఎదురుగా రివ్వుమంటూ వాయువేగంతో వచ్చిన ఒక బెంజ్ కారు బ్రేకు వేసింది. సుజాత తృళ్ళిపడింది.

ఆ కారులోంచి ఎవరో పదెనిమి సంవత్సరాల యువకుడు దిగాడు. చాలా స్టయిల్ గా వున్నాడు. వైయిట్ పేంటు వయిట్ జర్కిన్ వేసుకున్నాడు. డే అండ్ నైట్ లైట్ కలర్ కళ్ళద్దాలువున్నై. కుడిచేతికి బంగారు ఛెయినుంది. ఆ ఛెయినుమీద సుధాకర్ అని వుంది. సుజాత చూపులు మార్చుకుంది.

"ఏమండీ! మీరు.... మీరు సుజాతగారు కదూ?" ఆశగా అడిగాడు సుధాకర్. అవునన్నట్లు తలూపింది.

"మీ గురించి ఎంక్వయిరీ చేశానండీ. మీ డాడీ ఎ.వి.యం.లో షూటింగు జరుగుతుంది వెళ్ళమని చెప్పేరండీ. మీరు కనిపించారు. నాకు చాలా సంతోషంగా వుందండీ. ప్లీజ్ టు మీట్ యూ అండీ! అంటూ" కరచాలనం చేయాలని చేయి చాపాడు.

సుజాత యాంత్రికంగా చెయ్యి అందించబోయి ఆగి పోయింది. డిసెపాయింట్ అయ్యాడు సుధాకర్. సుజాత మొహంలో నవ్వు చోటు చేసుకుంది. కాసింత రిలీఫ్ ఫీలయ్యాడు సుధాకర్.

"మీకు గుర్తుందాండీ. ఆ రోజు ఫోన్‌లో మాట్లాడేను మాది విశాఖపట్నమండీ. నా పేరు సుధాకర్. ఇక్కడ మా ఫ్రెండ్ విజయకుమార్ బి.ఎ. చదువుతున్నాడు. మాకు విశాఖలో పెద్ద అల్యూమినియమ్ ఫాక్టరీ, ఒక పెద్ద హోటలు వున్నాయండి. మీరు వినేవుంటారు హోటల్ సరోవర్ గురించి—అది మాదేనండీ" అంటూ తనను గురించి పూర్తిగా పరిచయం చేసుకున్నాడు.

మనిషి చాలా తొందరపాటనీ స్పష్టంగా తెలి స్తుంది. కారు ఆగిపోయింది. తన వెనుక ప్రొడక్షను వేను ఆగిపోయింది. యింకాస్సేపుంటే ట్రాఫిక్ బంద్ అయ్యే ప్రమాదం గ్రహించి "సరే యింటికిరండి మాట్లాడుదాం. యిప్పుడు కాదు రేపుదయం!" అంది. ఆమె మాటలకు తలూపుతున్న సుధాకర్ తక్కున ఆగిపోయాడు.

ఆమెతో మాట్లాడకుండా మద్రాసులో ఒకరాత్రి అంతా గడపగలడా? ఎంత నరకం! తను భరించలేడు. సుజాతతో చాలా విషయాలు మాట్లాడాలి. సుజాత నవ్వుతుంటే రెప్పార్పకుండా చూడాలి. సుజాత కళ్ళల్లో కళ్ళుపెట్టి మూగగా ఎన్నో కలలు కనాలి. యివన్నీ తీరేదెపుడు? ఎలా? ఆలోచనలతో సతమతమయ్యాడు. కారు పక్కకి తొలగించాడు.

సుజాత కారు పక్షిలా రివ్వున ఎగిరిపోయినట్లనిపిం చింది. బహుశా డ్రైవరుతో చెప్పేవుంటుంది స్పీడుగా డ్రైవ్ చేయమని.

ఫాలో అయ్యాడు సుధాకర్. సుజాత కారు ఆగిన మరుక్షణమే తన కారూ ఆగింది.

సుధాకర్ ఫాలో అయినట్టు తెలిసికూడ సుజాత గమనించనట్టే ఊరుకుంది. యింట్లోకి వడివడిగా నడిచి వెళ్ళిపోయింది.

సుధాకర్ని చూసి, సుజాత తండ్రి పలకరించాడు. ప్రేమగా కూల్ డ్రింక్ యిచ్చి మాట్లాడాడు. సుజాతని పిలిచాడు.

అప్పటికి సుజాత మేకప్ తుడుచుకుని స్నానం చేసి ఫ్రెష్గా వుంది. సినీఫీల్డులో పనిచేసేవాళ్ళతో మాట్లాడా లంటే అదే మంచి సమయం. మొహంమీద మేకప్ వుంటుండగా మాట్లాడితే, చికాగ్గా ఫీలవుతారు— యింతకుముందుకంటే, సుజాత మొహం ప్రశాంతంగా వుంది. పెదవులమీద నవ్వు చోటు చేసుకుంది.

"అమ్మా! ఈయన సుధాకర్ గారని, విశాఖపట్నం. మనకి దూరం బంధువులు కూడా. రాజమండ్రిలో మనం లాడ్జింగ్ మెంటయిన్ చేస్తున్నపుడు వీళ్ళ నాన్నగారే వసుందేవారు ప్రతి నెలా. ఆయన మహారాజ పోషకుడు. వడ్డీ తీసుకోకుండనే మనకు చాలా అప్పు యిచ్చారు. నిజానికి మనం అసలు కూడా తీర్చలేదనుకో! ఆయన పేరు వీరభద్రరావు కదూ...." అన్నట్లు సుధాకర్ మొహంలోకి చూశాడు. సుధాకర్ నవ్వుతూ తల నిలువుగా ఊపేడు.

"అవును వీరభద్రరావ్. ఆయన కొడుకే ఈయన. పెద్ద బిగ్ షాట్స్. వెళ్ళండి. మేడమీద మాట్లాడండి. రాత్రికి మనింట్లో భోజనం. యిక్కడే వుండమని చెప్పమ్మాయ్!" అంటూ హెచ్చరింపుగా చూశాడు.

సుజాత తలూపింది.

సుజాత మేడమీదకు నడిచింది. సుధాకర్ కూడా ఫాలో అయ్యాడు.

సుజాతకి చాలా మంచి టేస్టు వుందనే చెప్పాలి. టెర్రస్ మీదనుండి చూస్తే చాలా సిటీ కనిపిస్తుంది. ముఖ్యంగా టి.నగర్‌లో పెద్ద పెద్ద బిల్డింగులన్నీ కనిపిస్తాయి. చల్లగాలికి మల్లెపందిర గుబాళిస్తుంది. సన్న జాజులు పందిరమీద లతలా అల్లుకుపోతున్న దృశ్యాన్ని చూస్తూ నుంచుంది సుజాత.

"మీ గురించి ప్రతిరోజూ ఆలోచిస్తూంటానండీ!" అన్నాడు ఏం మాట్లాడాలో తోచక, తనే ముందు కదుపుతూ. సుజాత చూడనట్లు, విననట్లు నటించింది. సుధాకర్ మరి కాస్త ముందుకు వచ్చాడు. ఎదురెదురుగా వున్నారు. ఇంతలేసి కళ్ళతో, తన ఆరాధ్య దేవతని తనివితీరా చూడసాగాడు.

"మీరు నా ఫేనండీ .. ఫీ-ఫీ .. కాదు కాదు. నేను నేనే మీ ఫేన్నండీ!" అన్నాడు తడబడుతూ.

సుధాకర్ తడబాటుకి, సుజాతకి నవ్వాగింది కాదు. సుజాత కిలకిలా నవ్వుతుంటే, ఈ ప్రపంచాన్నే మైమరిచిపోయాడు సుధాకర్.

సుధాకర్ చేష్టల్ని గమనించింది సుజాత తెలివిగా. సుధాకర్ బ్రీఫ్ కేస్ తెరిచాడు క్షణంలో. కళ్ళు మిరమిట్లు గొలిపేలా ధగధగమంటున్న రవ్వల నెక్లెస్ తీశాడు.

"ఏమండీ... మీరడిగారుకదూ....రవ్వల నెక్లెస్.... యిదిగో.... దీన్ని నేను చూస్తుండగా పెట్టుకోండి!" అమాయకంగా నవ్వాడు. సుధాకర్ నవ్వుతుంటే, పుచ్చ

పువ్వులా వెన్నెల కాసినట్టుంది.

సుజాత షాక్ ఫీలయ్యింది. ఏదో ఆట పట్టించడానికి అంటే నిజంగానే రవ్వల నెక్లెస్ తీసుకువచ్చేశాడా! ఈ తెగంపుని, ప్రేమనుకోవాలా? పిచ్చనుకోవాలా?

"ఏమండీ, ఏమిటండీ....మీతో ఎన్నో విషయాలు మాట్లాడదామనుకుంటే, ఏం మాట్లాడరు. ఈ నెక్లెసు పెట్టుకోండి. యిదెలా పెట్టుకోవాలంటే" అంటూ నెక్లెస్ హుక్ తగిలించాడు. సుజాత ఒళ్ళు జలదరించింది. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

సుజాత తల దించుకుంది.

ఆమెలో ఏదో సిగ్గు చోటుచేసుకుంది.

ఆమె రూపాన్ని మింగేసేలా చూస్తున్నాడు సుధాకర్.

"నేనంటే మీకు?" ప్రశ్నార్థకంగా చూస్తూ వుండిపోయింది.

"ప్రేమ....ఏదో ఆత్మీయతా బంధం....ఏదో....ఏదో మీరే ఈ ప్రపంచమంతా అనిపిస్తారు. మీరు లేకుండా బ్రతకడం నరకం అనిపిస్తుంది. మీరు నాకోసం ఆకాశం నుండి భూమికి దిగివచ్చిన దేవత! మీరు కరుణిస్తే ఈ జన్మ సార్థకమయిపోతుంది. లేదా అంతే, తిరిగి విశాఖ పట్నం వెళ్ళకుండా యిక్కడే ఎక్కడో దిక్కుమాలిన చావు చస్తాను. ఇది నా నిర్ణయం!" అన్నాడు విప్పారిన కళ్ళతో చూస్తూ.

సుజాత నవ్వింది. ఆమె నవ్వుని చూడటమంటే ఎంతో సరదా. సుధాకర్ కూడా నవ్వాడు. నాలుగు కళ్ళు కలుసుకున్నాయి. సిగ్గుతో ముడుచుకుపోయాడు సుధాకర్.

"మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారా?" అంది సీరియస్‌గా.

"ఓ యస్‌గా."

"ఈ మేడమీదనుండి క్రిందికి దూకుతారా!"

"ఓ యస్‌గా."

"అయితే దూకండి చూద్దాం!" అంటూ కిలకిలా నవ్వింది.

అంతే రెప్పపాటులో క్రిందనున్నాడు సుధాకర్. కాలు ఫ్రాంక్చరయ్యింది. ధారాపాతంగా రక్తం, మో చేతులు గీరుకుపోయాయి. జర్కిన్ రక్తంతో తడిసి పోయింది. సుజాత తండ్రికి ఏం జరిగిందో అర్థంకాలేదు.

6

చాల రోజుల సాంగత్యంలో సుజాతకి సుధాకర్ పంచప్రాణాలయిపోయాడు.

యిప్పుడు సుధాకర్‌కి మునుపటిలా తడబాటులేదు. సెటిల్టుగా మాట్లాడుతున్నాడు. నిశ్చలంగా చూస్తున్నాడు. అందంగా నవ్వగలుగుతున్నాడు.

సుజాత ఒక వారం రోజులు షూటింగులన్నీ కాన్సిలు చేసుకుంది. దాంతో పరిశ్రమలో పెద్ద సంచలనం బయలుదేరింది, సుజాత, సుధాకర్ అనే కుర్రాడితో కలిసి తిరుగుతోందని.

సుజాత సాలిగ్రామంలో ఒక ఎకరం స్థలం తీసుకుని ఆర్ట్ డైరెక్టరు రాజు చేత, అందమయిన పర్ణశాలలా నిర్మించుకుంది. అక్కడ ఒక అరగంటయినా గడిపితే, ప్రాణం గాల్లో తేలినట్లనిపిస్తుంది. అందమయిన పూల చెట్లు, గుబురుగా ఎదిగిన గులాబిచెట్లు ఆ పర్ణశాలకి

మరింత ఆకర్షణని తీసుకొచ్చాయి.

"సుధా!" అని పిలిచింది, సుధాకర్ ఒడిలో మేను వాల్చి ప్రశాంతంగా శూన్యంలోకి చూస్తోంది సుజాత.

"ఏం సుజీ!"

"మనం కలవడం చాలా చిత్రంగా జరిగింది కదూ?"

"ఊహు వాంటెడ్‌గానే జరిగింది!"

"ఎలా?"

"ఎలా అంటే—నిన్ను తెరమీద చూసిన మొదటి క్షణమే. నువ్వు నా ప్రేమికురాలివేననుకున్నాను. జీవితంలో నేను ఏ విషయంలోనూ ఫెయిలవ్వలేదు. నీ విషయంలోనూ కూడా అంతే! అయినా ఈ జన్మలోని బంధన కాదిది. జన్మజన్మల అనుబంధం సుజీ! మనది పవిత్రమయిన బంధం — ఈ బంధాన్ని భగవంతుడు కూడా వేరుచెయ్యలేడు!" అంటూ ఆమెను మరింత ముందు కావలించుకున్నాడు. ఆమె పెదవులు తగిలాయి.

సర్రమంటూ ఫియట్ కారు ప్రవేశపడింది. ఆ కార్లో నుండి ప్రొడ్యూసరు శ్రీకాంత్ దిగాడు. క్షణంలో మరో అంబాసిడర్ ఆగింది. అది డైరెక్టర్ భూషణరావు గారి కారు. యిద్దరూ కూడబలుక్కుని వచ్చినట్లనిపించింది. సుజాత కంగారుపడలేదు. సుధాకర్ లేచి కూర్చున్నాడు.

"గుడ్‌మానింగ్!" అంది సుజాత. శ్రీకాంత్ నవ్వాడు వ్యంగ్యంగా.

"దిసీజ్ గుడీవినింగ్. ప్రేమ మైకంలో కళ్ళు మూసుకుపోతే ఉదయానికి, సాయంత్రానికి ఆట్టే భేదం కనిపించదు క్షణాలు తప్ప! యూ మై కరెక్ట్!" అంటూ త్రిబుల్ ఫయివ్ వెలిగించాడు. సుజాత ముఖా

వంగా తలదించుకుంది.

"హలో గుడీవినింగ్ మాడమ్!" అంటూ నవ్వడానికి ప్రయత్నించాడు డైరెక్టరు భూషణరావు.

సుజాత స్వచ్ఛంగా నవ్వింది. ఆ నవ్వులో దోషం లేదు.

"గుడ్! మంచి హాండ్ సమ్ హీరోనే లవ్ చేశావన్న మాట! వెరీ గుడ్! ఈ హీరో వెనుక, ఆ సిపాసులు కూడా పుష్కలంగా వున్నాయని విన్నాను. వెరీ వెరీ గుడ్. నువ్వు ఏం చెబుతే అది చేస్తాడనీ, అవసరమయితే తన ప్రాణాలనీ అరచేతిలో పెట్టి, సరాసరి వైకుంఠం చేరుకుంటాడని కూడా విన్నాను .... బ్యూటిఫుల్! ఎక్స్ట్రీమ్లీ బ్యూటీఫుల్!" అంటూ చప్పట్లు చరిచాడు భూషణరావు.

సుజాత అసహనంగా మొహం పెట్టింది. సుధాకర్ తల దించుకున్నాడు. తనకిలాంటి ఎత్తిపొడుపు మాటలు వినడమంటే అసహ్యం.

"చూడు మిస్.... సారీ మిసెస్ సుజాతా సుధాకర్ గారూ! మీరు మీ జీవితంలో ఎందరినో....ఎందరినో ప్రేమించారు. ఎందరినో పెళ్ళిచేసుకుంటానని మాట కూడా యిచ్చారు. నాలాంటి నలుగురయిదుగురు అభాగ్యులతో పెళ్ళి నాటకాలు కూడా ఆడారు. యిన్ని చేసి యింత నమ్మించి, చివరికి ఆఫ్టాల్ ఒక యంగ్ కిడ్.... పనికిమాలిన కుర్రకుంకని కట్టపెట్టుకుందామనుకుంటున్నారు. యిలాంటి ఆలోచన ముందే నీకుంటే మాతో ఎందుకు నాటకం ఆడావ్? ఎందుకు పెళ్ళిచేసుకుంటానన్నావ్? ఎందుకు హోటల్లో బరితెగించి విచ్చలవిడిగా ప్రవర్తించావ్. యిందుకేనా?" నిలదీసి అడిగాడు

శ్రీకాంత్.

సుధాకర్ చంగున ఎగిరి శ్రీకాంత్ కాలరు పుచ్చుకున్నాడు. నాలుగు వాయించాడు. చెప్పుతీసి మరీ కొట్టాడు. శ్రీకాంత్ అహం దెబ్బతింది. వెంటనే బూటుకాలితో సుధాకర్ డొక్కలో తన్నాడు. గింగుర్లు తిరిగిపోయాడు.

"మీరసలు మనుషులా! పశువులా?" అరిచింది సుజాత.

"మనుషులం గనుకనే, మీ యిద్దర్నీ ప్రాణాలతో విడిచిపెడుతున్నాం. మరొకరయితే యిక్కడికిక్కడే, నిలువునా పాతిపెట్టి వుండేవారం!" అన్నాడు భూషణరావు.

"ఒరేయ్....ఏం కూశావురా!" అంటూ చేతిలోకి బెల్టు తీసుకుని ఝళిపించాడు.

బెల్టు హెడ్ కొనదేరి వుంది. దాంతో ఒకటి తీస్తే యింతే సంగతులు. భూషణరావు వెళ్ళి అంబాసిడర్లో కూర్చున్నాడు.

శ్రీకాంత్ విసురుగా "య్యాస్, ఐ విల్ సీ యువర్ ఎండ్" అంటూ ఫియట్ లో కూర్చుని....క్షణంలో మటుమాయమయ్యాడు.

ఆకాశం మబ్బులు క్రమ్మింది. చిటపటమంటూ చినుకులు పడుతున్నాయి. "సుధా! యిక్కడ వుండొద్దు యింకెక్కడికయినా వెళ్ళిపోదాం పద" అంది సుజాత.

సుజాత పిరికితనానికి సుధాకర్ నవ్వుకున్నాడు. సుజాతలో ఏదో భయం ఆవరించింది. యింతలో టెలిఫోను మ్రోగింది.

"హలో!" అంటూ ఫోను ఎత్తాడు సుధాకర్.

"ఎస్....ముందు ఆ ఫోను సుజాత కివ్వు!" దబాయించింది అవతలి గొంతు.

సుధాకర్ మరింత మొండిగా "ముందు మీరెవరో చెప్పండి. విషయం ఏమిటో చెప్తే అప్పుడు ఫోను ఆవిడకు యివ్వాలా, వద్దా అన్నది నేను నిర్ణయిస్తాను!" అన్నాడు.

అవతలి గొంతు ఖంగుమంటూ నవ్వింది. ఆ నవ్వు సుధాకర్ గుండెను దొలిచేసింది.

"బచ్చా! నువ్వు ఈ రోజు మొగుడివయ్యావురా! నేను నీ సుతికి ఏనాడో.... మొగుడ్ని! బాబు—ఫోన్ చేశాడని చెప్పు!" అన్నాడు.

ఆ మాటలు సుధాకర్ కి ములుకుల్లా గుచ్చుకున్నై. సుజాతకి కూడా లీలగా వినిపిస్తున్నై ఫోన్లోని మాటలు. వెంటనే సుధాకర్ చేతిలో ఫోన్ లాక్కుంది.

"యూ బాస్టర్డు! వాట్ నాన్సెన్స్ యు ఆర్ స్పీకింగ్. డోంట్ యూ నో మానెర్స్?" అని అడిగింది ఉక్రోషంగా. అవతలి గొంతు మళ్ళీ నవ్వింది.

"యూ .... యూ .... యూ ...." అంటూ ఫోను పెట్టేసింది. అయినా ఫోను రింగవుతూ నేవుంది. సుధాకర్ ఫోను ఎత్తుకున్నాడు. సుజాత వద్దని వారించింది. ఫోన్లో అవతలి గొంతు మాటలు వినిపించాయి.

"చూడు మైడియర్ యంగ్ బాయ్! నువ్వు సుజాతని ప్రేమించావ్—ప్రేమించు! మగాడివి గనుక ప్రేమించే రైటు నీకుంది. సుజాతని అనుభవించాలనుకున్నావ్—అనుభవించు! మగాడివి గనుక అనుభవించే రైటు నీకుంది గాని సుజాత మెడలో మూడు ముళ్ళు వేస్తున్నావ్. అదే....అదే ప్రాబ్లమ్! వెయ్యి మూడు కాకపోతే లక్ష

ముళ్ళు వెయ్యి! ఆ ముళ్ళు లిబరల్‌గా వుండాలి. ముడి విప్పి, మళ్ళీ వేసుకోడానికి అనుగుణంగా వుండాలి! ఎలా అంటే నీకు అవసరమున్నపుడు ముడి బిగిసివుండాలి మాలాంటివారికి అవసరమయినపుడు ముడి విప్పుతూ వుండాలి. అంతే! ఆ మాత్రం ఎడ్జెస్ట్‌మెంట్ చాలు. సుజాతతో వర్షంలో ఎంజాయ్‌మెంటు భలే బావుంటుందిలే—" అంటూ గలగలా నవ్వాడు. సుధాకర్ ఫోన్‌లో మరిక మాటలు వినలేకపోయాడు.

ఆ మాటలన్నీ సుజాత వింది. గోడకేసి తల బాదుకుంది. ఆ క్షణంలో తనను తాను పొడుచుకొని చచ్చిపోవాలనిపించింది. అభం శుభం తెలీని సుధాకర్‌ని అనవసరంగా చిత్రహింసకు గురిచేయడం నిజంగా ఘోరమయిన పాపం అనిపించింది. సుధాకర్‌కి తన మొహం చూపించలేకపోయింది.

"సుజీ! డోంట్ వర్రీ! నీతో గడిపిన నెలరోజుల్లో నువ్వు యెంత భయంకరమయిన విషవలయంలో చిక్కుకున్నావో అర్థమయింది. నీ స్థితి అర్థమయ్యాకే నిన్ను పెళ్ళిచేసుకుందామని గట్టి నిర్ణయానికి వచ్చాను. ఆ తరువాతే అష్టలక్ష్మి గుళ్ళో నీ మెడలో మూడు ముళ్ళూ వేశాను. యిది మనిద్దరికీ తెలిసిన సత్యం! ఈ రోజు మనం ఈ ప్రపంచాన్ని మరిచి, ఆదమరిచి పరవశించే తొలి రోజు. రా పోదాం! మరో ప్రపంచంలోకి పోదాం. మనల్ని ఏ ప్రకృతి శక్తులూ వేరుచేయలేవని మరో ప్రపంచంలోకి పోదాం రా సుజీ!" అంటూ సుజాత చెక్కిళ్ళమీద కన్నీరు తుడిచాడు.

అతడిని లతలా అల్లుకుపోయింది సుజాత.

7

"సుధా!" అంటూ ఆకాశానికి వినిపించేంతగా కేక వేసి స్పృహ కోల్పోయింది. దగ్గర్లో వున్న జనాలు పరుగెత్తుకొచ్చారు. మొహంమీద నీళ్ళు చల్లారు.

ప్రక్కనే కొయ్యబారిపోయిన సుధాకర్‌ని చూసి ఆశ్చర్యంతో స్థాణువుల్లా నిలబడిపోయారు. సుజాత తేరుకుంది.

"సుధా! సుధా! ఏమిటిది! యెందుకు నన్నింత అన్యాయం చేశావ్?" అంటూ జుత్తు పీక్కుంది. రాత్రి పరవశంలో వదులయిన జడ చింకిరిచింకిరిగా తయారయింది. మల్లెపూలు వూడిపోయి, ఒక్కొక్కటి క్రింద పడుతూంది.

సుధాకర్ పలకలేదు. సుధాకర్ ఈ ప్రపంచంలో లేడు. తను చెప్పినట్టే, మరో ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు.

జనం గుంపుగుంపులుగా పోగయ్యారు.

సుజాత ఫోనందుకుంది. వడపళని పోలీస్ స్టేషన్‌కి డయల్ చేసింది. ఇన్‌స్పెక్టర్ విజయ్ ఫోనందుకున్నాడు. విషయం కంగారుగా చెప్పింది. ఎడ్రస్ చెప్పింది. ఫోను పెట్టేసింది.

మరో అయిదు నిమిషాల్లో పోలీస్ జీపు ఆగింది. జీపులోంచి ఇన్‌స్పెక్టర్ విజయ్ అతని అనుచరులూ దిగేరు. విజయ్ కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి. పరిసరాల్ని అతిశ్రద్ధగా గమనించసాగాయి.

అప్పటికే సినిమా ఫీల్డుకి సంబంధించిన జనం కొందరు కార్లల్లో వచ్చివున్నారు. సుజాతకి సపర్యలు చేస్తున్నారు. ఎగ్రిమెంట్ చేయించుకున్న ప్రొడ్యూసర్లు దీర్ఘమయిన

నిట్టూర్పులు, తీవ్రమయిన సంతాపాల్ని తెలియచేస్తూ, ఒకర్నిమించి ఒకరు నటించడానికి తెగ ప్రయత్నాలు చేస్తున్నారు.

సుధాకర్ శవాన్ని పరీక్షగా చూడసాగాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. ఎక్కడా గాయంపడినట్లు కనిపించ లేదు. నిద్రపోతున్నవాడిలా వున్నాడు. యూ ఫోమ్ రౌండ్ బెడ్‌మీద మల్లిపూలు వాడిపోయినవి, చిందర వందరగా పడివున్నాయి. దగ్గర్లో రకరకాల స్వీట్సు. సగం తిని పారేసిన పళ్ళు వున్నై! అంటే మొదటి రాత్రి ఎక్విప్‌మెంట్ అంతా అక్కడే వుంది.

"అమ్మా! సుజీ! ఎంత అన్యాయం జరిగిందమ్మా!" అంటూ అంగలేస్తూ వచ్చి కుప్ప కూలినట్లుగా కూలి పోయాడు సుజాత తండ్రి రాఘవయ్య. తండ్రిని చూశాక దుఃఖం మరింత కట్టలు త్రెంచుకొని ప్రవహించసాగింది.

విజయ్ కళ్ళు మెరిశాయి. దూరంగా విసిరిపారేసిన సిగరెట్ కాలిన పొడి కనిపించింది. భద్రంగా తీసి పాక్ చేయించాడు. వెంటిలేటరుగుండా బయట కు చూశాడు. క్షణం అలా గమనిస్తూ వుండిపోయాడు విజయ్.

శవాన్ని పోస్టుమార్టమ్‌కి తగిన ఏర్పాట్లు చేయమని సార్జెంట్‌కి పురమాయించాడు.

సుజాతతోబాటు విజయ్ సుజాత యింటికి వెళ్ళాడు. లంకంత బంగళాలో వుంటోంది సుజాత, సుజాత తండ్రి యిద్దరే.

"రఘురామ్ గారూ! మీరు బయటికి వెళ్ళినట్టయితే సుజాతగారితో కొన్ని ముఖ్యమయిన విషయాలు పర్స నల్‌గా మాట్లాడాలి!" అన్నాడు. రఘురాం బయటికి

వెళ్ళాడు.

సుజాత తలదించుకొని ముభావంగా కూర్చుంది.

"ఇండస్ట్రీలో మీకు బాగా ఎనిమీస్ ఎవరు?" అనడిగాడు.

"అంటే?" అర్థంకానట్లు తెలూపింది.

"అంటే — మిమ్మల్నిగానీ మీ కత్యంత ప్రాణపద మయిన వాళ్ళనిగాని, చంపాలన్నంత కసి వున్న వాళ్ళు ఎవరయినా వున్నారా?" అంటూ ముహంలోకి పరీక్షగా చూడసాగాడు.

"నన్నూ, నా వాళ్ళనూ చంపాలన్న ఆలోచన వాళ్ళకు వుందో లేదో నాకు తెలీదుగానీ, ఈ మధ్యనే అత్యంత ఆప్తులనిపించుకున్న వాళ్ళు, కొన్ని కారణాలవల్ల శత్రువులయ్యారు!" అంది.

"ఎవరు వారు?"

"ప్రొడ్యూసరు శ్రీకాంత్, డైరెక్టరు భూషణరావు, హీరో బాబు. వీళ్ళు ముగ్గురూ."

"వారి ఎడ్రస్‌లు?"

సుజాత వివరంగా వారి ఎడ్రస్‌లు చెప్పింది. విజయ్ నోట్ చేసుకున్నాడు.

"వాళ్ళకు మీకు మధ్య ఎలాంటి గొడవలున్నై?"

సుజాత బాధగా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు దొరికాయి విజయ్‌కి.

"చూడండి! నేను సినీఫీల్డులో ఒక నటిని. వాళ్ళు ప్రముఖులు. ఒక సామాన్యమయిన హీరోయిన్‌కీ, పరిశ్రమలోని ప్రముఖులకీ మధ్య ఎలాంటి సంబంధాలుంటాయి. సమయానుకూలంగా వాళ్ళు అవసరాలు గడుపుకుంటారు. జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుని ఈ

ఫీల్డులో బజారునపడ్డాక మేమూ వాళ్ళ ఆకలికి బలై పోతాం. అయితే మేమూ మనుషులమే కదండీ! మాకూ మనసంటూ ఒకటి వుంటుంది కదండీ! ఆ మనసును తెలుసుకొనే మనిషిని పెళ్ళాడ్డం తప్పా? యిదే తప్పు అయితే, యింత పెద్ద శిక్ష విధిస్తారా! నిన్నే....నిన్నే నండీ ఆ లక్ష్మీదేవి సాక్షిగా మేము పెళ్ళిచేసుకుంది. మాకు ఈ ప్రపంచంలో సంబంధంలేకుండా, ఈ చిన్న కుటీరంలో తొలి రాత్రి గడుపుదామనుకున్నాం. శ్రీకాంత్, భూషణరావులు వచ్చారు. వాళ్ళు సుధాకర్‌తో ఘర్షణపడ్డారు. చంపుతానని బెదిరించారు. అయినా సుధ మొండి మనిషి. లక్ష్యపెట్టలేదు. ఉదయం చూసే సుధ శవం! నా సుధ నాతో చెప్పినట్టుగానే, ఈ పాపిష్టి ప్రపంచాన్ని విడిచిపెట్టి మరో ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు!" అంటూ మొహం పక్కకు తిప్పుకుంది.

విజయ్ గుండెలు కరిగిపినట్లనిపించింది. విజయ్ కళ్ళలో గిర్రుమంటూ కన్నీళ్ళు చిలికాయ్. నిజమే! సినిమావాళ్ళు మాత్రం మనుష్యులు కారా? సినిమావాళ్ళు శాప గ్రస్తులా? సినిమావాళ్ళకి కళ్యాణ యోగం లేదా? ఏమిటీ అన్యాయం? మనసులో ఎన్నో ప్రశ్నలు.

"ఇన్‌స్పెక్టర్! నా సుధని వాళ్ళ ముగ్గురిలో ఎవరో ఒకరు చంపేవుంటారు. ఎవరు చంపినా వాళ్ళకు శిక్ష పడాలి. భయంకరమయిన శిక్ష పడాలి. అలా పడితేనే గాని, చనిపోయిన సుధ ఆత్మ శాంతించదు. నా గుండె మంట చల్లారదు!" అంటూ దీర్ఘంగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పులో ఎన్నో అగ్నిశిఖలు—

"డన్! థాంక్యూ వెరీమచ్ ఫర్ యువర్ ఇన్ ఫర్మేషన్. మీకు ఫర్దర్‌గా ఏమయినా అనుమానాలు

కలిగితే నాకు ఫోన్ చెయ్యండి. హంతకుడు తప్పించుకో లేడు!" అంటూ హుందాగా బయటికి నడిచాడు.

రాఘవయ్య దుఃఖసముద్రంలో మునిగిపోయాడు.

"రాఘవయ్యగారూ!" పిలుపు వినిపించి తల పైకెత్తి చూశాడు.

"ఏమిటి సర్!"

"సుధాకర్ మీ కెప్పట్నుంచి తెలుసు!"

"చిన్నప్పటినుండీ తెలుసు బాబూ. మేము రాజ మండ్రీలో వుంటున్నప్పుడే వాళ్ళ నాన్నగారు మాకు చాలా సహాయం చేశారు. బాగా డబ్బున్నవాళ్ళు బాబూ! మా అమ్మాయి సినిమాల్లో చేరాక, మా అమ్మాయిమీద అభిమానం పెంచుకున్నాడు. అది కాస్త ప్రేమగా మారి, పెళ్ళిదాకా వచ్చింది. నా కొంప కూల్చింది బాబూ!" అంటూ భోరున ఏడ్చాడు.

"ఇట్సాల్ రయిట్! ప్రొడ్యూసరు శ్రీకాంత్, హీరో బాబూ, డైరెక్టరు భూషణరావు వీళ్ళ ముగ్గురిలో ఎవ రెలాంటివారు? కాస్త వివరంగా చెప్తారా?"

"ముగ్గురూ బయటికి తేనెపూసిన కత్తులు బాబూ! సిగ్గు విడిచి చెప్తున్నాను ఆ ముగ్గురూ నా కూతుర్ని...." అంటూ నోట్లో పంచె కుక్కుకున్నాడు. మొహం ఎర్రగా కందిపోయింది.

"యిప్పుడు ఏడిస్తే ప్రయోజనంలేదు. రాఘవయ్య గారూ! వివరాలు కావాలి!" అన్నాడు.

"ముగ్గురూ స్వార్థపరులే బాబూ! ఈ సినిమా ఫీల్డులో వున్న రాజకీయాలు ఈ ప్రపంచంలో మరెక్కడా వుండవు బాబూ! ఒకరు పైకి రావాలంటే మరొకడ్ని బలిచేయవలిసిందే. అలా వారి శవాల్ని మెట్లుగా ఉప

యోగిస్తూ శిఖరాగ్రం చేరుకుంటారు బాబూ గొప్ప గొప్ప వాళ్ళంతా. వీళ్ళకి నీతి, నిజాయితీ వుండదు. సిగ్గు ఎగ్గూ వుండదు. అవసరమయితే కాళ్లు పట్టుకుంటారు. అవసరం తీరాక గొంతు పిసికి చంపుతారు. ఇది సినిమా ధర్మం బాబూ! ఆ ధర్మమే నా కూతురి పసుపు కుంకుమ తుడిచేసింది బాబూ!" అంటూ మొహం చాటుచేసుకున్నాడు. విజయ్ అక్కడ్నుంచి భారంగా అడుగులు వేస్తూ బయటికి కదిలాడు.

8

ప్రొడక్షన్ వ్యాను బాబు యింటిముందు ఆగింది.

అది బాబు కోసం ప్రత్యేకంగా ఎయిర్ కండిషన్డ్ ఎరేంజ్ చేయబడి వుంది. బాబు తన అసిస్టెంట్ భాషతో చిందులేస్తున్నాడు. "వాట్ డూయూ మీన్! కంటిన్యూటీ షూ పోయిందంటే మాటలనుకుంటున్నావా! యిపుడు ఫస్టు షాట్‌లో ఆ షూ వుంటుంది ఎలా? నా షూ పోయిందని ప్రొడ్యూసరుకి చెప్తే అపహ్యాంగా వుండదూ? షూటింగ్ అప్ సెట్ కాదూ? ఛీ ఛీ ఛీ!" నొచ్చుకున్నాడు బాబు.

ఇన్స్పెక్టర్ విజయ్ బాబుని పరీక్షగా చూశాడు. మనిషి అయిదడుగుల పదంగుళాలు వుంటాడు. కండపుష్టి బాగా వుంది. కాలికేసి చూశాడు. నెంబర్ టెన్ అయితే షూ కాలికి అమరొచ్చు. పాదాలు పొడుగ్గా, వెడల్పుగా వున్నాయి.

"కమిన్ ఇన్స్పెక్టర్ గారూ! అయామ్ ఇన్ హర్రీ. ఐ మస్టు గో ఫర్ షూటింగ్!" అంటూ మరో షూ తొడుక్కున్నాడు.

"వాటీజ్ యువర్ షూ నెంబర్!"

"వైన్" అన్నాడు బాబు నవ్వుతూ.

"దట్స్ గుడ్ — మీకు సుధాకర్ తెలుసా?" అన్నాడు.

కుర్చీ లాగి కూర్చుంటూ — బాబు నవ్వాడు. ఆ నవ్వుకి అర్థం అతనిపట్ల తేలికభావం ఏర్పడింది.

"అదేం ప్రశ్నండీ బాబూ! ఒకే పరిశ్రమలో సుజాత నేనూ వుంటున్నాం. ఒకరి గురించి ఒకరికి తెలియకుండా ఎలా వుంటుంది చెప్పండి?" ఎదురు ప్రశ్న వేశాడు బాబు.

"అదే సుజాత, మీ మధ్య ఎలాంటి పరిచయముంది? సుధాకర్‌ని ఎవరో హత్యచేశారు? బహుశా ఎవరయి వుంటారని మీ అనుమానం?" అన్నాడు విజయ్, అతని మొహంలో రంగుల్ని గమనిస్తూ.

"చూడండీ! నాకిలాంటి మరణవార్తలంటే భయం. నిన్న రాత్రి, ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను. ఆ తరువాత ఈ రోజు ఉదయం ఆయన మరణ వార్త విన్నాను. మనుషులు ఎంత తొందరగా మటుమాయమై పోతారో సుధాకర్‌ని చూస్తే అర్థమవుతుంది. ఐ పిటీ హిమ్! సుధాకర్ అమాయకుడు. ఈ మధ్యనే విశాఖ పట్నంనుండి వచ్చాడు. బహుశా ఈ చావుని కళ్ళ చూడ్డానికే నేమో!" అంటూ జాలిపడ్డాడు బాబు.

"నా కా్కావలసింది మీ జాలి, సానుభూతికాదు. సమాధానం!" కొంచెం అధికారపూర్వకంగా అడిగాడు విజయ్.

"నన్నేం చెయ్యమంటారు సర్, సుజాత హీరోయిన్ నేను హీరో— హీరోయిన్‌కి హీరోకి మధ్య యెలాంటి సంబంధముంటుంది? యింతకుమించి నాకేం తెలీదు.

యింతకంటే నేనొక్క నిమిషం కూడా మీకు కేటా యించలేను. ఐయామ్ వెరీ వెరీ సారీ, అవసరమైతే సాయంత్రం ఆ తర్వాత కలుద్దాం. యింకా ఆలస్య మయితే అసలే అవదం తాగిన మొహం ఆ ప్రొడ్యూ సరుది. అసలు చూడలేం" అంటూ నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

9

శ్రీకాంత్ రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని మూడయిదుల సిగరెట్లు తగలేస్తున్నాడు. చుట్టూ నాలు గయిదు ఫోన్‌లున్నై. ఆ ప్రక్కనే ఇంటర్‌కమ్ వుంది.

"గుడ్ మార్నింగ్ సర్!" అంటూ విజయ్‌ను సాద రంగా ఆహ్వానించాడు—విజయ్ పరిసరాల్ని గమనిస్తూ కూర్చున్నాడు.

"డూ యూ వాంట్ కూల్ ఆర్ హాట్?" అంటూ ముందుకు వంగి ప్రేమగా అడిగాడు.

"ఓన్‌లీ కూల్ వాటర్!" అన్నాడు విజయ్.

"ఫన్నీ.... ఫన్నీ.... ఓన్‌లీ కూల్ వాటర్—నో.... నో... లెటజ్ హావ్ మజా!" అంటూ బెల్ నొక్కి ఇంటర్‌కమ్‌లో రెండు మజా ఆర్డరిచ్చాడు.

"వాట్ కెన్ ఐ డు ఫర్ యూ!" అంటూ లేచి మామూలు సీట్లో కూర్చున్నాడు శ్రీకాంత్.

విజయ్ "కెన్ ఐ హావ్ యువర్ సిగరెట్!" అంటూ ఒక సిగరెట్ తీసుకుని నిమిషంలో పూర్తిగా కాల్చేశాడు

"సుజాత మీకు తెలుసా?"

"యిదేం ప్రశ్నండీ—ఆవిడ్ని హీరోయిన్‌గా తెరకు పరిచయం చేసింది నేనేకదండీ — ఆవిడ్ని ఎస్టాబిష్

చేసింది కూడా నేనే కదండీ. ప్రత్యేకంగా తెలుసా? అంటారేమిటి? తెలుసు!" అన్నాడు.

"సుధాకర్ గురించి విన్నారుకదూ!"

"హఠాత్తుగా చనిపోయినట్లేనా?"

"అవును!"

"విన్నాన్సార్ — ఆ దారుణమయిన వార్త గంట క్రితమే విన్నాను. గుండె బాదుకున్నాను. ఎందుకంటారేమో. నిన్న రాత్రే నాకు ఒళ్లు పొగరెక్కి వాడికి వార్నింగ్ యిచ్చాన్సార్!" అన్నాడు శ్రీకాంత్.

"ఎందుకట పాపం!"

"ఎందుకంటారేమండీ — ఆ సుజాత మీద లీగల్ రైట్స్ నాకున్నై. ఆమె నా సొంతం. నా మనిషి. ఆమె మీద కొన్ని లక్షల పెట్టుబడి పెట్టాను. యింకా పెట్టాలనుకుంటున్నాను. అలాంటి సమయంలో, పానకంలో పుడకలా తయారయ్యాడు ఈ సుధాకర్ — కోపం ముంచుకొచ్చి, మాటా మాటా పెరిగి వార్నింగ్ యిచ్చాను. అయితే ఆయన చావుకీ నాకూ ఎలాంటి సంబంధం లేదండీ, నన్ను నమ్మండీ!" కంగారుగా నచ్చ జెప్పాడు.

"మరెందుకా కంగారు?"

"కంగారు ఉండదండీ — మనిషిని చంపుతానని బెదిరించాను తాగిన మైకంలో — ఉదయం నేను లేచేసరికి సుధాకర్ మరణవార్త వినేసరికి, తాగిన మత్తు కాస్తా దిగిపోయింది. నిజం సర్-నన్ను నమ్మండి సర్!" అంటూ విజయ్ రెండు చేతులు పుచ్చుకొని ప్రాధేయపడ్డాడు.

శ్రీకాంత్ ని పరిశీలనగా చూశాడు. హైట్ బాబు కంటే కొంచెం తక్కువ. కాని, కాలిమడమలు,

వైశాల్యం ఎక్కువగానే వుంది.

"వాట్స్ యువర్ షూ నెంబర్?" అనడిగాడు విజయ్.

"జస్టు టెన్ ఐ థింక్—ఆఫ్‌కోర్స్ నైన్ కూడా సరిపోతుంది" అన్నాడు తడబడుతూ. శ్రీకాంత్ సిగరెట్ సగం కాలి బూడిదకింద రాలిపోయింది. దాన్ని యాష్‌ట్రేలో విడిచిపెట్టలేదు. బయటే వుంచేశాడు గ్లాసుమీద—

"సిగరెట్ ఈమధ్యనే అలవాటు చేసుకున్నారా?" విజయ్.

"అవునండీ! ఏదయినా యిలాంటి ఒక మంచి అలవాటు వుండాలని చేసుకున్నాను. కాని కాల్చడం నాకు నిజంగా రాదండీ — పొగ గుండెల్లో పీల్చుకోవడం, యాష్‌ట్రేలో బర్నింగ్ డస్టు విడిచిపెట్టడం అలవాటు లేదు. దరిద్రం!" నొచ్చుకున్నాడు.

"ఓ.కె. సుజాతకి మీకు తెలిసి ఎవరయినా శత్రువులున్నారా?" అనడిగాడు విజయ్ ఫైనల్‌గా.

"నో.... నో .... సుజాతకి శత్రువులెవరుంటారండీ— ఆ అమ్మాయి చాలా మంచి మనిషి. పెళ్ళి చేసుకుందన్న కోపమేగానీ మరో ద్వేషంలేదు ఆమె మీద మాకు ఎవరికీ!" అన్నాడు.

"పెళ్ళి చేసుకుంటే కోపం దేనికి?"

"అదేమిటండీ పబ్లిక్‌గా వాడుకనే పార్కుని ఎవరో కామందు గుత్తకొన్నేశాడంటే కోపంగా వుండదండీ! ఛలేవారే—" అని నవ్వాడు.

విజయ్ శ్రీకాంత్ వైఖరికి జాలిగా నవ్వాడు.

10

పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చింది.

హతుడ్ని ముందు క్లోరోఫామ్ చూపించి స్పృహ కోల్పోయేలా చేసి, పొటాషియం సైనైడ్ ఇంజక్షన్ ఇయ్యడం ద్వారా హత్యగావించబడినట్లు తేలింది.

విజయ్ వెంటనే మరోసారి హత్యజరిగిన ప్రాంతాన్ని సందర్శించాడు. కుటీరంలో పరిశీలనగా చూశాడు. షూ ప్రింట్ లెంత్ టేప్ తో కొలిచాడు. సరిగ్గా పది ఇంచీలు—ఎంత లోతుకు షూ దిగిందీ చూశాడు. సుమారు రెండు ఇంచీలకు పైగా దిగింది, అంటే హంతకుడు కనీసం ఎయిటీ కేజిస్ వుండితీరాలి.

పోలీస్ జీపు భూషణరావు యింటికేసి పరుగుతీసింది. మధ్యదారిలో గోల్డెన్ టుబేకో బ్రాంచి ఆఫీసు కనిపించింది. తనకు పరిచయమున్న బయ్యార్ ని కలుసుకున్నాడు. ఇద్దరూ చాలాకాలం తర్వాత కలుసుకున్నందుకు బయ్యర్ హేపీగా ఫీలయ్యాడు. విజయ్ తన పాకెట్ దాచిన సిగరెట్ బర్నింగ్ డస్టు తీసి చూపించాడు. అంతకు ముందు కుటీరంలో దొరికిన బర్నింగ్ డస్టు రెండూ ఒకటేనా కాదా? తేల్చి చెప్పమన్నాడు.

బయ్యర్ కాస్సేపు రెండు పౌడర్లనీ పరిశీలనగా చూసి, "యస్, దిసీజ్ ఎక్స్ ఒన్" అన్నాడు తేల్చి చెబుతూ. పుగాకులో ఎక్స్ ఒన్ నెంబరు ఒన్ గ్రేడ్—క్లాస్ ఒన్ పొగాకు. దీన్నే బ్రిటన్ కు ఎక్స్పోర్టు చేస్తున్నారు. విజయ్ కి ఆ సిగరెట్ డస్టు త్రిబుల్ ఫయివ్ దని తేలపోయింది. అంటే హంతకుడు త్రిబుల్ ఫయివ్ కాల్చి వుండాలి. భూషణరావు యింటిముందు

జీపు ఆగింది.

లోపల భూషణరావు బిజీగా వున్నాడు. విజయ్‌ని చూసి మందహాసం పులుముకొని "రండి! కూర్చోండి" అంటూ ఆహ్వానించాడు.

"సుధాకర్‌ని ఎవరో హత్యచేశారు మీకు తెలుసా?" అంటూ కుర్చీ ముందుకు లాక్కున్నాడు. తృళ్ళిపడ్డాడు భూషణరావు.

"ఏమిటి మీరంటున్నది. సుధాకర్‌ని ఎవరో చంపేరు. మీకు తెలుసా? అంటున్నారా? ఎవరు చంపేరో మీకు తెలుసా? అంటున్నారా" అని యెదురు ప్రశ్న వేశాడు అమాయకంగా.

"రెండూనూ."

"ఒకదానికే నా దగ్గర సమాధానముంది. అది మీకు తెలుసు."

"సుధాకర్‌ని కావాలనే చంపేరనా?"

"డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడకండి. సుధాకర్‌ని యెవరో చంపేరు. కావాలనే చంపేరో వద్దని చంపేరో ఎవరికి తెలుసు. నేను ఆలోచిస్తున్నది సుధాకర్ కోసం కాదు. ఆయన పోయాడు లెట్ హిమ్ డై—కానీ బంగారంలాంటి భవిష్యత్తు వున్న సుజాత కోసం. సుధాకర్ చావుతో సుజాత పిచ్చిదయిపోతుంది. మరిక నటించదు. ఆమె నటించకపోతే పరిశ్రమ కొన్ని కోట్లు నష్టపోతుంది. అదే నా బాధ" అన్నాడు కళ్ళద్దు తుంటూ.

"ఐ టూ ఏక్స్పెక్ట్ యూ! కాని సుధాకర్‌ని చంపింది ఎవరో తెలియకపోతే సుజాత నిజంగా పిచ్చెక్కి పోతుంది. ఆ తరువాత ఆమె ఏం చేస్తుందో అది మన

చేతుల్లో లేదు. ఎవరో సుజాతమీద పగతో సుధాకర్ ని చంపేరు. ఆ యెవరన్నది మీ ముగ్గురిలో ఒకరన్నది మీకు తెలుసని నాకు తెలుసు ఎవరో తప్పుని ఒప్పుకోవడం, నిజం చెప్పడం శ్రేయస్కరం. సుధాకర్ కి క్లోరోఫాం చూపించి, అతన్ని స్పృహ కోల్పోయేలా చేసి పొటాషియం సైనెడ్ ఇంజక్షన్ చేశారు. ప్లాన్డ్ గా చంపేరు."

"నో విజయ్ గారూ! ప్రక్కనే సుజాత వుంది. దట్ టూ యివి ఫస్ట్ నైట్స్. సుజాత షూటింగ్సులో నే తెల్లార్లూ నిద్రపోదు. యూనిట్ ని నిద్రపోనివ్వదు. ఈ తీయని రాత్రిని వృధా చేస్తుందంటారా! ఐ కాంట్, ఐ కాంట్ బిలీవ్ ఇట్-సుజాత ప్రక్కనే వుంటుండగా సుధాకర్ ని ఎవరు చంపుతారు? ఎన్ని గుండెలు?" ఎదురు ప్రశ్న వేశాడు భూషణరావు.

"గుడ్! కాని, సుజాత అప్పటికే మానసికంగా విసిగి పోయింది. అలసిపోయింది. తనకావలసింది అనుభవించే మగాడు ఓదార్చే ఒక నిండు హృదయం కావాలి. ఆ అనుభూతిలో తనను తాను మరిచిపోయింది. యిన్ని రోజులూ రాత్రింబవళ్ళు షూటింగ్సు చేసి, నిద్రలేని తను ఆదమరిచి నిద్రపోయింది. అదే సమయమనుకొని సుధాకర్ ని హత్య చేశారు. కావాలనే ఈ హత్య కసికొద్దీ చేశారు మిస్టర్ భూషణరావు" అని మందలించాడు.

భూషణరావు తృళ్ళిపడ్డాడు.

కాలి మడమలకేసి చూశాడు విజయ్.

"వాటీజ్ యువర్ షూ నెంబర్?" అనడిగాడు.

"మే బి టెన్" అంటూ షూ అడుగు చూసి కన్ ఫర్మ్ చేశాడు.

"దెన్ వాటీజ్ యువర్ వెయిట్?"

"మేబి సెవంటీ!" అంటూ వెయింగ్ మిషనుమీద నుంచున్నాడు సెవంటీ టూ వరకూ వెయిట్ చూపి స్తోంది.

11

రాత్రి పదిన్నరయింది.

సుజాత యింటిముందు యెన్నో కార్లు, యింటినిండా జనం. పోస్టుమెన్ అప్పటికప్పుడే అందిన టెలిగ్రాంల దొంతర యిచ్చి, సుజాత చేత సంతకం చేయించుకుం టున్నాడు. తరువాత ముఖ్యమయిన ప్రొఫ్యాసర్లు వచ్చారు. అందరూ తమ పెట్టిన పెట్టుబడిని కాపాడే బాధ్యత సుజాతమీద నే వేశారు. ఈ షాక్ కి తట్టుకోమని ధైర్యంగా, మొండిగా జీవితాన్ని కొనసాగించాలని ఉపన్యాసాలు యిచ్చారు.

సుజాత అన్నిటినీ ఓపిగ్గా వింది. తల బద్దలయి పోతుంది. అందర్నీ రేపు కలుసుకోమని చెప్పింది.

విజయ్ జీపులోంచి దిగేసరికి ఒక్కొక్కరు 'యటికి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు.

"రండి! ఇన్ స్పెక్టర్ గారూ!" అంటూ సాదరంగా ఆహ్వానించింది సుజాత. విజయ్ సుజాతతో పర్సనల్ రూమ్‌లోకి నడిచాడు.

"సుధాకర్ ని చంపింది యెవరో ఒకరే—అయితే, కేసును మిస్ గైడ్ చేసేందుకు, కొన్ని అభూతకల్పనలు కల్పించి మరీ చంపేరు. అనుమానితులు ముగ్గుర్నీ పరి శోధించాను. తగిన ఆధారాలు దొరకలేదు" సాలో చనగా పైకి చూశాడు.

"అభూత కల్పనంటున్నారుకదా — అ వ్వేం టో

చెప్పండి" ఇంట్రెస్టింగ్ గా కొంచెం ముందుకు వంగి అడిగింది.

"నెంబరు వన్ వర్షం కురిసింది గనుక అడుగుల ముద్రలు స్పష్టంగా కనిపించాయి. హంతకుడు తొడుక్కున్న షూ నెంబర్ టెన్—హంతకుడు బరువు కనీసం యెనభై కిలోలు. హంతకుడు త్రిబుల్ ఫయివ్ సిగరెట్స్ కాలుస్తాడు. సుధాకర్ ని చంపేముందు క్లోరోఫామ్ చూపించి, పొటాసియం సైనైడ్ ఇంజక్షన్ చేశాడు. ఈ హత్య చాలా తెలివిగా చేశాడు!" అంటూ పళ్ళు పటపట కొరికాడు.

సుజాత ఆలోచనల్లోపడింది.

"పోనీ సుధాకర్ కి పర్సనల్ గా ఎనిమీస్ ఎవరయినా వున్నారా?" విజయ్ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేదు. తను యెక్కడో ఆలోచిస్తుంది.

"లేరండీ! సుధాకర్ మద్రాసుకి కొత్త! తనకి ఫ్రెండ్సులేరు. శత్రువులూ లేరు. వుంటే నా తరఫువాళ్ళే అయివుండాలి. బట్ హీరో బాబు, ప్రొడ్యూసరు శ్రీకాంత్, డైరెక్టర్ భూషణం వీళ్ళ ముగ్గురిలో ఎవరో ఒకరు హంతకుడు ఎందుక్కాకూడదు?" అడిగింది.

"నో...నో—నాకూ అలాంటి అనుమానమే వచ్చింది. బాబు హత్య గురించి విన్న తరువాత అతని మొహంలో ఏ విధమయిన గిల్టీ ఫీలింగు కనబడలేదు. హత్య చేసిన వాడెవడు, అంత కాజువల్ గా వుండడు. హంతకుడి బరువు యెనభై కేజీలుపైన. బాబు అంత బరువులేడు. బాబు సిగరెట్ కాల్చడు. నటించడం తప్ప ఏం చేత కాదతనికి.

నెంబర్ టు: శ్రీకాంత్ చాలా తొందరపాటు

మనిషి. ట్రిబుల్ ఫయివ్ సిగరెట్ లయితే కాలుస్తాడు గాని, మిగతా విషయాల్లో పూర్తిగా భిన్నం—అయితే బాబు, శ్రీకాంత్, భూషణరావు ముగ్గురూ సెంబర్ టెన్ షూ వాడటం కొంచెం విచిత్రంగా వుంది. ఈ విషయంలో అనుమానించదగ్గ అంశం ఏంలేదు. కొంత మంది సైజు పెద్ద షూ వాడొచ్చు.

ఒక్కటి మాత్రం నిజం! ఈ ముగ్గుర్నీ హంతకులుగా చూపించాలని యెవరో అధిక తెలివి తేటలతో ముగ్గురి మానరిజంలు చూపించాడు. తెలివిగా సుధాకర్ ని చంపేడు!" భారంగా నిట్టూర్చాడు విజయ్.

"ఐసీ!" అంటూ ఊపిరి విడిచింది దీర్ఘంగా.

సుజాత కళ్ళు ఎర్రబారాయ్. మొహంలో వింత రంగులు మారాయి. ఆమెలో ఏదో కసి, ఏదో కక్ష్య, ఏదో ఆవేశం. క్షణక్షణానికి ఆమె రూపం భయంకరంగా మారిపోతోంది.

"వాట్ మాడమ్ వాట్ హాపెండ్!" అంటూ కంగారుగా అడిగాడు విజయ్.

"నథింగ్ హాపెండ్, లెట్ మీ టేక్ రెస్ట్!"

విజయ్ హుందాగా బయటకు కదిలాడు.

12

రాత్రి పన్నెండయింది.

పన్నెండు గంటలు కొట్టి గోడ గడియారం అలిసి పోయింది.

తనలాగే సెకన్ల ముల్లు మాత్రం ముందుకు కుంటు కుంటూ పయనిస్తుంది. సుజాత కళ్ళుమూసుకొని బలవంతంగా నిద్రపోదామని ప్రయత్నించి ఫెయిలయ్యింది. కళ్ళు మూసినా తెరిచానా ఎక్కడ చూసినా సుధాకర్

కనిపిస్తున్నాడు. లేచింది. గుండె రాయిచేసుకుంది. రాఘవయ్య రూమ్‌లోకి నడిచింది.

రాఘవయ్య తనకుతనే ఇంజక్షను చేసుకుంటున్నాడు. సుజాత గుండె ఆగినంత పనయింది. తన తండ్రి ఇంజక్షన్ కూడా చేసుకోగలడా?

"నాన్నా! ఇదెప్పట్నుంచి?" వ్యంగ్యంగా అడిగింది.

"నువు బిజీ అయినప్పటినుంచీ తల్లీ! రాత్రిళ్ళు ఒక పట్టున నిద్రరాదు. కాంపోజ్ ఇంజక్షన్ చేసుకుంటే కళ్ళు మూతలు పడుతుంది. ఒక అరగంటలో నిద్రపట్టేస్తుంది. ఆ....ఏవిటమ్మా ఇంతరాత్రపుడు వచ్చావ్ — భయంగా వుందా!" ప్రేమగా అడిగాడు.

"అవున్నాన్నా! ఊహించని దృశ్యాలు కళ్ళకు కనిపిస్తున్నపుడు భయంగానే వుంటుంది."

"యెందుకమ్మా భయం! జీవితంలో యెన్నో సమస్యలు యెదురవుతాయి. అన్నిటికీ యిలా కంగారు పడితే యెలా? ఈ రోజు సుధాకర్ పోయాడు. రేపు యిలా. ప్రతి ఒక్కరూ పోవలసినవాళ్ళే కదా!"

"ఆ పోయేదాంట్లో ముందు వెనుక లున్నాయి కద నాన్నా!"

"అది ప్రాప్తం! దేవుడు చేసింది!" అనుభవపూర్వకంగా నవ్వాడు.

"మనుషులే చేస్తే?" సూటిగా కళ్ళలోకి చూస్తూ ప్రశ్నించింది.

"అది కూడా ప్రాప్తమే తల్లీ! ఎలా రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది!" సిగరెట్ ముట్టించాడు త్రిబుల్ ఫయివ్.

"ఇదెప్పటినుంచి నాన్నా!"

"అదేనమ్మా. కాంపోజ్ ఇంజక్షను యిచ్చాక ఒకసారి సిగరెట్ కాలిస్తే మనసుకు ప్రశాంతంగా ఉంటుంది. యిది ఈ మధ్యనే అలవాటయిందమ్మా!"

"అంటే బాగా సంపాదించిన తర్వాత....కదు, నాన్నా!"

"అవునమ్మా! డబ్బు ఎందుకు? అనుభవించడానికే కదా!" నవ్వాడు.

"ఎవరు? నువ్వా! నేనా?"

"ఇద్దరమునూ!"

"నో....నువ్వు హాపీగా వున్నావు నాన్నా! నేను ఉండగలుగుతున్నానా? నువు నిద్రకోసం కాంపోజ్ చేసుకున్నావు త్రిబుల్ ఫయివ్ సిగరెట్ వెలిగించావ్! యెంత ప్రశాంతంగా మాట్లాడగలుగుతున్నావ్! నీలా నేను ఉండగలనా నాన్నా!" బాధగా అడిగింది.

"ఉండగలవు తల్లీ కళ్ళు మూసుకొని పడుకో!" అన్నాడు లాలనగా. ఆయనకు అప్పుడే నిద్ర ముంచుకొస్తూంది. ఆవలించసాగాడు.

"మరీ షూస్ ఏమిటి—పడుకున్న సమయంలో మా. తీయకూడదా!" అంటూ రాఘవయ్య బూట్లు విప్పింది.

ఆ బూట్లు రాఘవయ్యవి కావు. హీరో బాబు వేసుకునేవి. షూటింగులో చూసిన గుర్తు! అసలు నెంబరు టెన్ సైజు కాదు. నెంబర్ ఎయిట్. మరెందుకు నెంబర్ టెన్ షూస్ వాడినట్లు? పోలీసుల్ని, పరిశోధకుల్ని మిస్ గయిడ్ చేయడం కోసం. ఎంత తెలివి ప్రదర్శించాడు. పళ్ళు పటపట కొరికింది.

"నాన్నా రెండు సంవత్సరాల క్రితం నీ బరువు డెబ్బై ఆరు కిలోలు కదు నాన్నా!" వ్యంగ్యంగా అడిగింది.

సుజాత ధోరణి రాఘవయ్యకి విచిత్రంగా కనిపించింది.

"అవునమ్మా! క్రిందటి సంవత్సరం ఎనభై రెండు, ఈ సంవత్సరం ఎనభై ఎనిమిది. ఏం తల్లీ! యెందుకీ పిచ్చి ప్రశ్నలు" నవ్వుతూ అడిగాడు.

"పిచ్చిదాన్ని కనుక!"

"సర్లె పడుకోమ్మా, నిద్రొస్తుంది!"

"నాకు నిద్రపట్టదు నాన్నా!"

"కళ్ళు మూసుకు పడుకో! అదే వస్తుంది! వెళ్లు—"

"హంతకుడు కళ్ళెదుట కనిపించిన తరువాత నిద్ర రావడం అంత తేలికా నాన్నా!"

"యెవరమ్మా హంతకుడు?"

"నీకామాత్రం తెలీదా నాన్నా!"

"ఎవరు?"

"నువ్వు!"

"అమ్మా!"

"ఎందుకు నాన్నా! నక్క వినయాలు. నువ్వే సుధాకర్‌ని చంపేవు. బాబు, శ్రీకాంత్, భూషణరావు, ముగ్గురిలో యెవరో ఒకర్ని హంతకుడుగా యిరికించాలని, వాళ్ళ అలవాట్లను పులుముకొని నాటకం ఆడావు. తెలివిగా హత్యచేసి తప్పించుకున్నావు—నాన్నా! ఛీఛీ! నిన్ను నోరారా నాన్నా అని పిలిచినందుకయినా ఈ హత్యా ప్రయత్నం మానుకోవలసింది. నువు మనిషివి కావు! నీలో రాక్షసత్వం యింకా పోలేదు. నీ బ్రతుకంతా అమ్మాయిల్ని బజారున అమ్మి, అమ్మాయిల సంపాదనతో గడపడమేనా? ఎందుకు .... ఎందుకు రాఘవయ్యా! ఈ హత్యచేశావ్" చొక్కా పుచ్చుకొని లాగింది.

రాఘవయ్య భయంకరంగా నవ్వాడు.

"యెన్నాళ్ళకు కళ్ళు తెరిచావ్ నా కూతురా! నీకు సంఘంలో బ్రతకడానికి తండ్రి అవసరమయ్యాడా! నీకు సినిమాల్లో చేర్పించడానికి తండ్రి అవసరమయ్యాడా! నిన్ను రౌడీల బారినుండి రక్షించడానికి తండ్రి అవసరమయ్యాడా? నీ మార్కెట్ పెంచడానికి తండ్రి అవసరమయ్యాడా? ఈ రోజు సుధాకర్ని చూడగానే తండ్రి మీద అసహ్యం పుట్టిందా? యెంతటి జాణవే నువ్వు! తెరమీద నటించు! పిచ్చి జనం జేజేలు కొడతారు. నిజ జీవితంలో నటించకు! మొహాన ఉమ్ముతారు!" అన్నాడు ఉక్రోషంగా.

"రాఘువయ్యా! నీ అసలు రంగు బయటపెట్టావ్. దిక్కుమాలిన వాడిలాగ మా కొంపలో చేరావ్. మా అమ్మకి మగదిక్కుగా వుంటానన్నావ్. నాకు తండ్రిగా పోగావేశావు. నా సుఖం కోసం, నా క్షేమం ప్రతి క్షణం పాటుపడతానని చనిపోయిన మా అమ్మమీద ప్రమాణం చేశావ్. ఈ రోజు సుధాకర్ని చంపి, నీ కృతజ్ఞత బుజావు చేసుకున్నావ్. వీరభద్రరావుగారు మనకి శ్రేయోభిలాషన్నావ్. మనకి ఆపదలో యెంతో సాయపడ్డారన్నావ్. దానికి ప్రత్యుపకారం సుధాకర్ని పొట్టన పెట్టుకున్నావ్. హూం....ఆల్‌రయిట్! తెలివి నీ ఒక్కడి సొత్తుకాదు" అంటూ కాలరు పుచ్చుకొని గుంజింది.

రాఘువయ్య కళ్ళు మూతలు పడుతున్నై. రెప్పలు ప్రయత్నంమీద తెరవగలుగుతున్నాడు. కాళ్ళు గట్టిగా విదిలించాడు. లేవడానికి ప్రయత్నంచేస్తూ. షూస్ క్రింద పడిపోయాయి రాఘవయ్య వెనక్కు వాలిపోయాడు.

మగత నిద్రలోకి జారుకున్నాడు.

అల్మారా తెరిచింది. క్లోరోఫామ్ కనిపించింది. ఆ ప్రక్కనే పొటాషియం సైనైడ్ వుంది. అంటే వీటితో సుధాకర్‌ని హత్య చేశాడు. సుజాత పళ్ళు పటపట కొరికింది.

సిరేంజిలోకి సైనైడ్ యెక్కించింది. రాఘవయ్య వెల్లకిలా పడుకున్నాడు. వెయిన్స్‌కి ఇంజక్టు చేసింది. గిలగిలా గింజుకున్నాడు. సుజాత భారంగా నిట్టూర్చింది. కాస్సేపటికి రాఘవయ్యలో చలనం ఆగిపోయింది.

సుజాత కళ్ళనిండా సుధాకర్ కనిపించాడు. అమాయకమైన నవ్వు కనిపించింది. సుధాకర్ డెడ్ బాడీ దగ్గర వున్న ఆధారాలు త్రిబుల్ ఫయివ్ సిగరెట్ డస్టు, టెన్ సైజ్ షూస్ అన్నీ వున్నై. బయటికి నడిచింది.

"సుధా! నన్ను క్షమించు! ముళ్ళని ముళ్ళతోనే తీయాలి! వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి! ఆడపిల్లల్ని బజారున అమ్మకోనే గోముఖ వ్యాఘ్రాలకు ఈ ప్రభుత్వం తగిన శిక్ష విధించదు! కన్న తండ్రుల బురఖా తగిలించుకొని, బ్ర తి కు న్నం త కాలం చిత్రహింసకు గురిచేసే ఈ కలియుగ అపర పితృదేవుళ్ళను సమూలనంగా నాశనం చేయాలి! న రి కే యా లి! నిలువునా పాతెయ్యాలి! అపుడే స్త్రీలోకానికి స్వేచ్ఛ!" పిచ్చిగా అరిచింది. భోరుమని తల బాదుకొని ఏడ్చింది. అలిసిపోయింది. మగత నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారింది.

రాఘవయ్య మరణవార్త గుప్పుమంది పరిశ్రమలో. పలువురు ప్రముఖులు వచ్చేశారు.

"సుధాకర్ చనిపోయినట్టే రాఘవయ్య కూడా

చనిపోయాడు. సుధాకర్ దగ్గర కనిపించిన ఆధారాలే రాఘవయ్య దగ్గరా కనిపించాయి. సుధాకర్‌ని యెవరు హత్య చేశారో, రాఘవయ్యనూ వాళ్ళే హత్య చేసి వుంటారు!" యిది జనవాక్యం మాత్రం కాదు. పోలీసు డిపార్టుమెంట్ రాఘవయ్య మరణంపట్ల వెలిబుచ్చిన సిన్సియర్ తీర్మానం.

సుజాతకి నవ్వాలో ఏడవాలో తెలీని పరిస్థితి. ఏడవ లేక పగలబడి నవ్వుతుంది లోలోన.

—:ఐ పో యిం ది:—